క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



అమీనాబాద్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జడ్డంగి ఎస్ఐ చినబాబు

రాజవొమ్మంగి: గ్రామాల్లోకి వచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసగిస్తున్న వారు ఎక్కువయ్యారని, జాగ్రత్తగా ఉండాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు ప్రజలను హెచ్చరించారు. కమ్యూనిటి పోలీసింగ్‌లో భాగంగా ఆయన మంగళవారం రాత్రి మండలంలోని అమీనాబాద్ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రైతులు తమ పొలాల్లో విద్యుత్ కంచెలు వేయవద్దని కోరారు. గ్రామపెద్దలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమావేశం నేడు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీడీవో కార్యాయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఉపాధి హామీ కో–ఆర్డినేషన్ సమావేశానికి అందరు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆదివాసీ ఉత్సవాలను విజయవంతం చేయాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఎటపాక: ఆదివాసీ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. మండలంలోని కె.ఎస్.పురం ఆశ్రమ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత చదువులు, సక్రమంగా చట్టాల అమలుతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి జరగనున్న ఆదివాసీ నవోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



టీచర్ రాధాకుమారిని సన్మానిస్తున్న టీడబ్ల్యూ డీడీ రుక్మాండయ్య తదితరులు

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేయనున్న జి.రాధాకుమారి సన్మాన కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం ఆర్.వరలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, మండల విద్యాశాఖ అధికారి టి. మల్లేశ్వరరావు, విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పేరు నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ఆయన కొనియాడారు. ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. గిరిజన విద్య సేవకు అంకితమైన రాధాకుమారి సేవలు అభినందనీయమన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎంలు ప్రసాద్ , ప్రసాద్ బాబు, ఆకులు వెంకటేశ్వర్లు , ఇమ్మానియేలు, ఝాన్సీ హేన్సన్, ఎస్.ఎం పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు బి.వి.ఎస్.రామారావు, బి.నాగేశ్వరరావు, శ్రీరాములు , పీఎస్ కుమార్, తదితరులు మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి నాలుగు దశాబ్దాలుగా ఆమె చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఉపాధ్యాయురాలు రాధాకుమారిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఉమాదేవి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, యూటీఎఫ్ ప్రతినిధులు రాంబాబు, రఘుబాబు పాల్గొన్నారు.

అమ్మవారి గుడికి విరాళం

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన యల్లపు అప్పారావు జ్ఞాపకార్థంగా అతని కుమారుడు నాగేశ్వరరావు, భారతి దంపతులు బుధవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- అధ్వాన దారితో అవస్థలు
- దెబ్బతిన్న వంతెనతో రాకపోకలకు ఇక్కట్లు
- గ్రామస్తుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పాతరామవరం బ్రిడ్జిపై గోతులు



రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న నెల్లిపూడి వంతెన

గంగవరం: మండలంలోని చాలా ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటి వరకు మండలంలోని రహదారులు, డ్రైనేజీలు ఇతరత్రా సమస్యలపై కనీసం దృష్టిసారించలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి – గంగవరం ప్రధాన రహదారిలో గల కొండవాగుల వద్ద నిర్మించిన వంతెనలు అధ్వానంగా ఉన్నాయి. ఈ దారిలో పాడైన వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండలంలోని గంగవరం నుంచి గోకవరం దారిలో బాగా రద్దీ బాగా పెరిగింది. నిత్యం వందలాది మంది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. పాతరామవరం – నెల్లిపూడి మధ్యలో కొండవాగు వద్ద చాలా కాలం క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలస్థితికి చేరుకుంది. భారీ వర్షాల సమయంలో వాగు ఉధృతికి ఈ వంతెన చాలా దెబ్బతింది. వర్షాలు సమయంలో ఈ వంతెన పై నుంచి రెండు అడుగుల ఎత్తులో వరద నీరు పారుతోంది. తుపానులు, ఏకధాటి వర్షాలు, వానాకాలంలో ఈ మార్గంలో ఉన్న గ్రామాలకు బయట ప్రపంచం సంబంధాలు ఉండవు. వంతెన పై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంటోంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ వంతెన వద్ద రెయిలింగ్ (రక్షణ గోడ) లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల గొరగుమ్మి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వంతెన పై నుంచి వాగులో పడి కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. రెయిలింగ్ లేకపోవడంతో రాత్రిళ్లు ఈ వంతెన మీదుగా ప్రయాణించేందుకు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. పాడైన వంతెనను బాగు చేయాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతన వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున భారీ వర్షాలు పడే సమయంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా మండలంలోని కామరాజుపేట నుంచి పాతరామవరం గ్రామాల మధ్య గల బురదకాలువపై (సూరంపాలెం) వాగుపై నిర్మించిన వంతెన కూడా అధ్వానంగాఉంది. దెబ్బతిన వంతెనపై రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన అప్రోచ్ కూడా కోతకు గురవుతుంది. ఈ వంతెనపై భారీగా గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వంతెన సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



నెల్లిపూడి సమీపంలో దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన చాలా ప్రమాదకరంగా ఉంది. ఈ బ్రిడ్జి వద్ద వాగు ప్రవాహానికి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుషులుతోపాటు, పశువులు కూడా కొట్టుకుపోతున్నాయి. ఈ వంతనపై రాత్రిళ్లు ప్రయాణించేందుకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సంకుమళ్ల ఏసు, నెల్లిపూడి గ్రామం

మరమ్మతు చేయాలి



కామరాజుపేట నుంచి పాత రామవరం గ్రామాల మధ్య గల పెద్ద వంతెన బాగా దెబ్బతింది. ఈ వంతెన గోతులతో నిండి ఉంది. గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు గ్రామస్తులు వినుతులిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాడైన వంతెనకు మరమ్మత్తులు చేయించాలి. .

– బూరుకట్ల నాగేశ్వరరావు, పాతరామవరం

ప్రతిపాదనలు పంపాం

నెల్లిపూడి వంతెన దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్నాం. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.. కామరాజుపేట బ్రిడ్జి మా పరిధిలోని లేదు. అది రాజమండ్రి సెక్షన్‌లో ఉంది. నిధులు మంజూరైన వెంటనే ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు ప్రారంభిస్తాం.

– కొమ్మన ప్రదీప్, ఏఈ, ఆర్అండ్‌బీ, రంపచోడవరం

మానవ అక్రమ రవాణాపై అవగాహన



మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న నేచర్ కళాజాత బృందం సభ్యులు

అరకులోయటౌన్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరస్వతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విద్యార్థులందరూ మానవ అక్రమ రవాణా గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 23 మానవ అక్రమ రవాణా నిషేదం గురించి తెలియజేస్తుందని, ప్రభుత్వం కూడా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌ల ద్వారా దానిని అరికడుతుందన్నారు. మానవ హక్కుల అక్రమ రవాణాపై నేచర్ సంస్థ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, నాగబాబు, నేచర్ సిబ్బంది టి.సంతోష్ కుమార్, బి. కృష్ణబాబు, సునీల్, అద్దు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి తెగపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: విశ్రాంతి ఉద్యోగి బాబురావునాయుడు వాల్మీకి తెగపై దుష్ప్రచారం చేయడం తగదని సుజనకోట సర్పంచ్ వెంగడ రమేష్ అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో బుధవారం వాల్మీకి తెగ గిరిజనులు సమావేశమయ్యారు.పదవీ విరమణ పొందిన ఐఎస్ఐ అధికారి బాబురావునాయుడు రచించిన ఉనికి కోల్పోతున్న ఆదివాసీలు అనే పుస్తకంలో వాల్మీకి తెగపై అసత్య ప్రచారం చేయడంపై వారంత తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకి తెగ తక్కువగా ఉందని ముద్రించడం సరికాదన్నారు. 34 గిరిజన తెగలు ఉండగా కేవలం 4 గిరిజన తెగలను ఉద్దేశించి రాయడం, ముఖ్యంగా వాల్మీకి తెగను తక్కువగా ఉందని, కించపరిచేలా ఈ పుస్తకంలో రచించారన్నారు. ఇది వాల్మీకి జాతి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, ఒక బాధ్యత గల మాజీ ఐఏఎస్ అధికారి అయి ఉండి వాస్తవాలు తెలుసుకోకుండా గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించేలా ఉందని, తక్షణయే ఆయన రాసిన పుస్తకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షన వాల్మీకి ఆగ్రహానికి గురి కాక తప్పందని ఆయన హెచ్చరించారు. వాల్మీకి సంఘం ప్రతినిధులు ప్రభాకరరావు,గణపతి, నరేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి



మాట్లాడుతున్న పాయం కన్నారావు

కూనవరం: మండలంలోని టేకులబోరు జీపీఎస్ పాఠశాలలో అనిగె నాగేశ్వరరావు అధ్యక్షతన యూటీఎఫ్ మండల కమిటీ సమావేశం బుధవారం జరిగింది.కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాయం కన్నారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. పాఠాల బోధనలకు బదులుగా ఉపాధ్యాయులకు ఇతరత్రా కార్యక్రమాలు, సర్వేలతో విద్యాప్రమాణాలు పూర్తిగా కుంటుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. పీ 4 బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పాయం కన్నారావు కోరారు. శాంత, మహతి, సీత, నాగదుర్గ, లక్ష్మి, ప్రియాంక, రామలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మండల కేంద్రం కోసం డిమాండ్



ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, మండల సాధన కమిటీ సభ్యులు

పాడేరు రూరల్: గుత్తులపుట్టుని ప్రత్యేక మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కుంతర్ల పంచాయతీ కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించినట్టు గుత్తులపుట్టు మండల సాధన కమిటీ సభ్యులు తాంగుల మహేశ్వరరావు, సూరిబాబు, బుజ్జి తదితరులు చెప్పారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పెదబయలు మండలానికి చెందిన అతి మారుమూల ప్రాంతాలతో పాటు పాడేరు మండలానికి సమీపంలో ఉన్న 14 పంచాయతీలను అనుసంధానం చేస్తు గుత్తులపుట్టు కేంద్రంగా మండలంగా ప్రకటించాలన్నారు. పాడేరు, పెదబయలు మండల కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తల వెళ్లాలన్నా గిరిజనులకు అనుకూలం లేదన్నారు. ఈ కారణంగా గుత్తులపుట్టుని మండల కేంద్రంగా ప్రకటిస్తే స్థానికులకు అనువైన ప్రాంతంగా ఉంటుందన్నారు, కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మండల కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. పాడేరు, పెదబయలు, మండలాల పరిధిలోని 28 గ్రామల గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సింగర్బలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



గోమంగిలో బదిలీపై వెళ్తున్న సచివాలయం ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ సచివాలయం పరిధిలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు బుధవారం శాలువలు కప్పి, మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. సింగర్బ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయా ఉద్యోగులకు సర్పంచ్ కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పాంగి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజు, సూర్య ప్రకాష్ నాయుడు, రామకృష్ణ ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఇటీవల తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గిడ్డి రాజ్‌కుమార్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాంగి అంద్రయ్య, వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు సల్లంగి ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు బెదరా బంగారాజు, క్రిస్టియన్, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు వంతాల కృష్ణారావు బుధవారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించి గిరిజనులకు అండగా నిలవాలని వారు కోరారు. తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



జి.మాడుగులలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదబయలు: మండలంలోని గోమంగి, అడుగులపుట్టు గ్రామ సచివాలయాల్లో ఐదేళ్ల పనిచేసిన బదిలీపై వెళ్తున్న గ్రామ సచివాలయం ఉద్యోగులకు బుధవారం ఆయా సర్పంచ్‌లు, నాయకులు, ప్రజలు ఘనంగా శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల చెంతనే సుపరిపాలన అందించే దిశగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి అన్ని శాఖల ఉద్యోగాలను భర్తీ చేసి ప్రజలకు సేవలందించారని కొనియాడారు.కార్యక్రమంలో భాగంగా బదిలీపై వెళ్తున్న సచివాలయం సిబ్బంది అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేశారని కొనియాడారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీటీసీ పోయిభ కృష్ణారావు, సర్పంచ్ అశోక్‌కుమార్, ఉప సర్పంచ్ కూడ మత్స్యకొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిబాబు, కొమ్మ బాలరాజు, పీసా కమిటీ సభ్యులు, సునీల్, వార్డు సభ్యులు, భాస్కర్‌రావు, ధనుంజయ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని మోసాలే



కూటమి ప్రభుత్వ మోసాలను గిరిజనులకు వివరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌లు

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని మోసాలేనని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు బుధవారం పాడేరు మండలం వల్లాయి గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, పలు పంచాయతీల సర్పంచ్‌లంతా గ్రామంలో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం మోసాలను గిరిజనులకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని అమలుజేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు.

రైతుల సంక్షేమాన్ని కూడా విస్మరించడం అన్యాయమన్నారు. సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర, సోమెలి లక్ష్మణరావు, వంతాల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



మాడగడలో కమిటీ నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు



పద్మాపురంలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- పంచాయతీల్లో పార్టీ కమిటీల నియామకం
- కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే మత్స్యలింగం సూచనలు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి గ్రామ కమిటీ కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్టాసింగి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు బుధవారం మాడగడ, పద్మాపుం పంచాయతీ కేంద్రాల్లో పార్టీ పంచాయతీ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

నూతన పంచాయతీ కమిటీ వివరాలు...

మాడగడ పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా సమర్డి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శులుగా గొల్లోరి పైడన్న, కొర్రా గురుమూర్తి, పెదమజ్జి అర్జున్, సాగర రామకృష్ణ, ఆరుగురు కార్యదర్శులు, పద్మాపురం పంచాయతీ కమిటి అధ్యక్షుడిగా కిల్లో బాలరాజు, ప్రధాన కార్యదర్శులుగా కె.రాము, జన్ని సన్యాసి, బురిడి దామోదర్, మాదల రాందాస్, కార్యదర్శులుగా ఆరుగురు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్, సర్పంచ్ సుస్మిత, నియోజకవర్గం ఎస్టీ సెల్ కార్యదర్శి నర్సింహమూర్తి నాయకులు కుమార్, సాంభ, సుబ్రయ్య, పూర్ణ, పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మోసాలపై విస్తృత ప్రచారం



కూటమి ప్రభుత్వం మోసాలపై క్యూర్ కోడ్‌లతో రూపొందించిన పోస్టర్‌ను ఇంజరిలో ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



సూకురులో గ్రామస్తులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'
- తరలివచ్చిన నాయకులు, గ్రామస్తులు

పెదబయలు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నేరవేర్చకుండా, ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టులు చేస్తూ రాక్షసపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు అన్నారు. మండలంలోని గిన్నెలకోట, ఇంజరి పంచాయతీ కేంద్రాల్లో బుధవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం జోరు వానలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలుచేయకుండా అరాచక పాలన సాగిస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ జరిగేదని, ప్రస్తుతం కూటమి పాలనలో డీఆర్ డిపోలకు వచ్చి సరకులు పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో శివారు గ్రామాల్లో ఉన్న గిరిజనులు రేషన్ పొందేందుకు కాలినడక సుదూరంలో ఉన్న డిపోలకు రావల్సిన దుస్థితి నెలకొందన్నారు. వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల రోడ్డుపై పడేశాడన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలుసుకునేందుకు పోస్టర్‌లలో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తెలుసుకోవాలని కోరారు.కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది పైగా గడిచినా నేటి వరకు అన్నదాతలకు పెట్టుబడి సహాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ సీజన్‌లకు ముందుగానే రైతులకు పెట్టుబడి సాయం, ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించి రైతులు దండగా నిలిచారన్నారు. రైతుల నుంచి పంట కొనుగోలు చేసి వారికి అన్ని విధాలుగా ఆదుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 18 ఏళ్ల నిండిని ప్రతీ మహిళలకు రూ.1500 ఇస్తామని, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తామని హామీలు ఇచ్చి పాలకులు మరిచారన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, రెడ్ బుక్ రాక్షసపాలన తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం అరాచకం, మోసాలపై పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఇంజరి, గిన్నెలకోట మాజీ సర్పంచ్ వంతాల కామేశ్వరరావు, రామన్నపడాల్, నాయకులు కరిదేశి బాబూరావు, రాము, మత్స్యయ్య, మూర్తి, బాలు, చిట్టిబాబు, శ్రీను, జీవన్, తౌడుబాబు, శేషులు, చంద్రమ్మ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని డి.చింతలవీధి, సూకురు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేసిన దొంగ హామీలు, మోసాలపై గ్రామస్తులకు పార్టీ శ్రేణులు క్షుణ్ణంగా వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా ఒక్క పథకాన్ని అమలుచేయలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్, రాక్షస పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పంచాయతీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, రేగం రమేష్, ధనసాని సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు సింహాచలం, నాయకులు వెంకట్, మురళి, మహేష్, శివాజీ, లక్ష్మయ్య, చిన్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.